సాక్షి అనంతపురం

సోమవారం । 25 । సెప్టెంబర్ । 2023



టమాట కిలో రూ.10

కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.3, సరాసరిన రూ.6 ప్రకారం క్రయ విక్రయాలు సాగాయి.



పుంజుకున్న ఆర్టీసీ

ప్రత్యేక సర్వీసులు నడపడం ద్వారా ఆర్టీసీ ఆదాయం పుంజుకుంది. శ్రావణంలో అత్యధికమంది ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేశారు.

8లో

గరిష్టం/కనిష్టం

36.3°/22.7°

జిల్లా అంతటా ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

12 మండలాల్లో వర్షం



యల్లనూరు వద్ద చిత్రావతి నది పరవళ్లు

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలో అక్కడక్కడా మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు పడుతున్నాయి. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు 12 మండలాల పరిధిలో 6.4 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. పెద్దవడుగూరు 45.2 మి.మీ, శింగనమల 36.4, పామిడి 27.4, పుట్లూరు 25.4, యల్లనూరు 23.4 మి.మీతో పాటు తాడిపత్రి, యాడికి, పెద్దపప్పూరు, గార్లదిన్నె, అనంతపురం, బుక్కరాయసముద్రం, బెళుగుప్ప తదితర మండలాల్లో వర్షం కురిసింది. సెప్టెంబర్ నెల సాధారణ వర్షపాతం 110.9 మి.మీ కాగా, ఇప్పటి వరకు 73.3 మి.మీ నమోదైంది. మొత్తం మీద ఈ సీజన్‌లో 284.7 మి.మీకు గాను 206.1 మి.మీ వర్షం కురిసింది. ఈ నెలాఖరుతో ఖరీఫ్ ముగుస్తుంది. అక్టోబర్ నుంచి రబీ మొదలు కానుంది. కాగా రాగల రెండు రోజులు జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. అక్కడక్కడ కురుస్తున్న వర్షాలు ఖరీఫ్ పంటలకు కొంత ఊరటనిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ఉద్యాన పంటలకు ఈ-క్రాప్ తప్పనిసరి



ఉద్యాన పంటల్లో ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న డీహెచ్‌వో జి.చంద్రశేఖర్

అనంతపురం అగ్రికల్చర్: అన్ని రకాల ఉద్యాన పంటలను ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని ఆ శాఖ రెండు జిల్లాల అధికారులు బి.రఘునాథరెడ్డి, జి.చంద్రశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చాలామంది రైతులు వ్యవసాయ పంటలకే ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఉద్యాన పంటలకు కూడా తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేయించాలని సూచించారు. చీనీ, దానిమ్మ, అరటి, టమాట వంటి పంటలకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత పంటల బీమా అమలు చేస్తున్నందున ఈ-క్రాప్ అనేది చాలా కీలకమన్నారు. పంట ఉత్పత్తులు అమ్ముకోవాలన్నా, ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేయాలన్నా ఈ-క్రాప్ ముఖ్యమని తెలిపారు. ఈ నెలాఖరు వరకు సమయం ఉన్నందున ఆర్‌బీకే అసిస్టెంట్లను సంప్రదించి పండ్లతోటలు సాగు చేసిన ప్రతి రైతూ పంట వివరాల నమోదుతో పాటు ఈ-కేవైసీ కూడా చేయించుకోవాలని సూచించారు.

బలవంతపు వసూళ్లకు పాల్పడితే ఉపేక్షించం

- ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ హెచ్చరిక



బలవంతపు వసూళ్లకు పాల్పడిన హిజ్రాలు వీరే

కళ్యాణదుర్గం/ అనంతపురం క్రైం: జిల్లాలో ఎక్కడైనా బలవంతపు వసూళ్లకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ అన్బురాజన్ హెచ్చరించారు. రాయదుర్గం మండలం వడ్రవన్నూరుకు చెందిన రామప్ప తన పిల్లల ఆరోగ్యం సరిగా లేకపోవడంతో శనివారం కళ్యాణదుర్గం వచ్చి, అక్కడి నుండి అనంతపురం ఆస్పత్రికి బయలుదేరారు. కళ్యాణదుర్గం శివారులోని అక్కమ్మ గారి కొండ వద్ద ఇద్దరు హిజ్రాలు రామప్ప బైక్‌ను ఆపి రూ.2,500 బలవంతంగా లాక్కున్నారు. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీంతో ఎస్పీ ఈ ఘటనను తీవ్రంగా పరిగణించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో బలవంతపు వసూళ్లకు పాల్పడిన ఇద్దరు హిజ్రాలను కళ్యాణదుర్గం పోలీసులు అరెస్టు చేశారు. జిల్లాలో ఎక్కడా ఈ తరహా ఘటనలు జరిగేందుకు వీలు లేదని స్పష్టం చేశారు. బలవంతపు వసూళ్లు ఏ రూపంలోనైనా, ఏ కోణంలో ఉన్నా సహించబోమన్నారు. యాచన పేరుతో బలవంతంగా వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, హిజ్రాలు సమాజంలో గౌరవంగా బతకాలని ఆయన సూచించారు. ఎక్కడైనా బలవంతపు వసూళ్లకు దిగినా, ప్రజలకు అసౌకర్యం కలిగినా, ఈవ్‌టీజింగ్, తదితర వేధింపులు జరిగినా వెంటనే తన సెల్ (94407 96800)కు ఫోన్ చేయవచ్చని, లేదా సమాచారం పంపవచ్చని ఎస్పీ తెలిపారు.

‘వందే భారత్’కు అపూర్వ స్వాగతం



అనంతపురం రైల్వేస్టేషన్‌లోకి అడుగిడిన వందే భారత్ రైలు



అనంతపురంలో వందే భారత్ రైలును జెండా ఊపి సాగనంపుతున్న ఎంపీ తలారి రంగయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మేయర్ వసీం, రైల్వే డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్

అనంతపురం సిటీ: ‘వందే భారత్’ ఎక్స్‌ప్రెస్ రైలుకు అనంతపురంలో అపూర్వ స్వాగతం లభించింది. ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటలకు కాచిగూడ నుంచి బయలుదేరి రాత్రి 7.10 గంటలకు అనంతపురం రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. ఎంపీ తలారి రంగయ్య, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మేయర్ వసీం, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సుమతి సురతాని, ప్రజలు, విద్యార్థులు రైల్వేస్టేషన్ చేరుకుని రైలుకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కొందరు త్రివర్ణ పతాకం ఎగురవేసి జాతీయభావాన్ని ప్రదర్శించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు రైలు వద్ద గ్రూపు ఫొటోలు దిగారు. ప్రయాణికులు, భారీగా తరలివచ్చిన సందర్శకులు సెల్ఫీలు దిగడంతో పాటు రైలును తాకుతూ, ముద్దాడుతూ ఆనందం పంచుకున్నారు. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందిన ‘వందే భారత్’ రైళ్లలో ప్రయాణం చేస్తే సమయం ఆదా అవుతుందని, వీటిని ఆదరించాలని ఎంపీ రంగయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మేయర్ వసీం, డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్, అనంతపురం స్టేషన్ మేనేజర్ అశోక్‌కుమార్ నాయుడు కోరారు.

- వందే భారత్ రాకను పురస్కరించుకొని అనంతపురంలో మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. జాతీయ భావాన్ని పెంపొందించేలా విద్యార్థినులు చేసిన నృత్యాలు కట్టిపడేశాయి.
- ‘వందే భారత్’ రైలు ప్రారంభోత్సవం సందర్భంగా అతిథులతో పాటు వీఐపీలు, విలేకర్లు, ప్రముఖులకు రైల్వే అధికారులు బోర్డింగ్ పాసులు పాసులు ఉచితంగా అందజేశారు. ఎనిమిది కోచ్‌లతో వచ్చిన ఈ రైలులో పాసులున్న వారు అనంతపురం నుంచి ధర్మవరం వరకు ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించారు. అక్కడి నుంచి తిరిగి రావడానికి మరో రైలులో వారందరికీ ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించారు.

అటవీ భూమి అన్యాక్రాంతం



చెట్లు నరికేసి భూమి చదును చేసిన దృశ్యం



సమీపంలోని ఇసుక దిబ్బల్లో కన్పిస్తున్న పచ్చని చెట్లు

- చెట్లు నరికివేయించిన టీడీపీ కార్యకర్త
- 4 ఎకరాలు చదును చేసి ఆక్రమణ
- చోద్యం చూస్తున్న ఫారెస్టు అధికారులు

కణేకల్లు: తెలుగుదేశం పార్టీకి చెందిన ఒక కార్యకర్త బరితెగించాడు. అటవీ శాఖ పరిధిలోని భూమిపై కన్నేశాడు. ఎడారి నివారణ కోసం కళేకుర్తి సమీపంలో పెంచిన చెట్లను నరికివేయించి, ఆనవాళ్లు లేకుండా చేశాడు. నాలుగెకరాలు చదును చేసుకుని ఆక్రమించాడు. వివరాల్లోకెళ్తే... కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లో వేదవతి హగరి పరివాహక ప్రాంతంలో వేలాది ఎకరాల్లో ఇసుకమేటలు విస్తరించి ఎడారిని తలపిస్తున్నాయి. ఆషాఢంలో గాలులకు ఈ ఇసుక తెరలు తెరలుగా లేచి ఎగిసి మేటలుగా ఏర్పడుతుంటాయి. గత ప్రభుత్వాలు ఎడారి నివారణలో భాగంగా కళేకుర్తి, మాల్యం, తుంబిగనూరు, మీన్లహళ్లి, బిదరకుంతంతోపాటు వివిధ గ్రామాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాయి. ప్రస్తుతం ఈ మొక్కలు పెద్దవయ్యాయి. ఎటు చూసినా పచ్చగా కన్పిస్తూ ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. మరో వైపు ఈ చెట్ల నడుమ ఇసుకదిబ్బలు ముందుకు కదలడం లేదు. వేదవతి హగరి ఒడ్డునున్న ఎడారి ప్రాంతమంతా అటవీ శాఖ పరిధిలో ఉంది. ఈ ప్రాంతంలో పెంచుతున్న చెట్లను పరిరక్షించాల్సిన బాధ్యత ఆ శాఖ అధికారులదే.

సాగుకు అనుకూలమని కబ్జా..

కళేకుర్తి గ్రామ శివారులో హెచ్చెల్సీ అక్విడెక్ట్ కుడివైపున వేదవతి హగరి ఒడ్డున ఎడారి ప్రాంతంపై అదే గ్రామానికి చెందిన ఓ టీడీపీ కార్యకర్త కన్నుపడింది. ఈ భూమి పంటల సాగుకు చాలా అనువుగా ఉండటంతో ఎలాగైనా కబ్జా చేయాలనుకున్నాడు. అంతే నెల రోజుల క్రితం నాలుగు ఎకరాల్లో ఉన్న పెద్ద పెద్ద చెట్లను నరికించేశాడు. ఆ తర్వాత జేసీబీ సాయంతో చెట్ల ఆనవాళ్లు లేకుండా చేశాడు.

బీట్ ఆఫీసర్ మౌనం..

అటవీ భూముల్లో పచ్చని చెట్లను నరికివేస్తున్న విషయం తెలుసుకున్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ముడుపులు తీసుకొని మౌనంగా ఉండిపోయారని ఆరోపణలు ఉన్నాయి. ఈ ప్రదేశానికి కొంత దూరంలో ఇసుక కూడా ఉంది. ఇసుక అక్రమ రవాణా కాకుండా బీట్ ఆఫీసర్ పహారా కాస్తుంటారు. చెట్ల నరికివేత విషయం తెలిసినా ఎటువంటి చర్యలూ తీసుకోలేదని స్థానికులు చెబుతున్నారు.

ఎకరా రూ.12 లక్షలు..

వేదవతి హగరి నది ఒడ్డున ఉన్న ఇసుక భూములు ప్రస్తుతం సారవంతంగా మారాయి. ఒకప్పుడు దేనికీ పనికిరాని ఈ భూముల్లో వేరుశనగ, వరి పంట చాలా బాగా పండుతోంది. దీంతో ఈ భూమికి భారీగా డిమాండ్ ఏర్పడింది. ఎకరం రూ.12 లక్షల వరకు పలుకుతున్నట్లు సమాచారం. వేదవతి హగిరి ఒడ్డున ఉన్న ప్రభుత్వ భూములను అనేక మంది కబ్జా చేసి సాగు చేసుకుంటున్నారు. అనధికారికంగా అగ్రిమెంట్లపై భూముల క్రయ విక్రయాలూ జరుగుతున్నాయి. అధికారులు నిర్లక్ష్యంగా ఉంటే ప్రభుత్వ భూములు పూర్తిగా అన్యాక్రాంతమవుతాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం


ఎడారి నివారణ కోసం పెంచిన చెట్లలో ఏ ఒక్కటి నరికినా ఉపేక్షించే ప్రసక్తే లేదు. భవిష్యత్తులో ఇసుక దిబ్బలు విస్తరించకుండా కట్టడి చేసేందుకు ఎంతో కష్టపడి చెట్లను పెంచాం. అలా పెంచిన చెట్లను ఎవరు నరికారు? ఎంత విస్తీర్ణంలో నరికారు? అనే విషయాలను క్షేత్రస్థాయిలో వెళ్లి విచారణ చేస్తాం. అలాగే అక్కడ విధులు నిర్వర్తిస్తున్న బీట్ ఆఫీసర్‌ను కూడా దీనిపై ఆరా తీస్తాం. చెట్లు నరికిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఆ స్థలం అన్యాక్రాంతం కాకుండా కాపాడుతాం.

– బి.లక్ష్మప్ప డీఆర్‌ఓ, రాయదుర్గం

‘పర్యాటకం’పై రేపు చిత్రలేఖన పోటీలు

అనంతపురం కల్చరల్: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ఉదయం 9 గంటలకు జిల్లా పర్యాటక కార్యాలయంలో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నారు. ‘మీకు నచ్చిన కోట’ అనే అంశంపై సాగే పోటీలలో విద్యార్థులందరూ పాల్గొనాలని జిల్లా పర్యాటకశాఖాధికారి జి.నాగేశ్వరరెడ్డి కోరారు. మరిన్ని వివరాలకు ఆర్ట్ మాస్టర్ పురంధరుడి సెల్ నంబర్ 79979 09209ను సంప్రదించాలని సూచించారు.

జలపాతం హొయలు..



జలపాతంలో కేరింతలు కొడుతున్న యువత

తలుపుల: రెండురోజులుగా కురిసిన వర్షాలకు మండలంలోని కదిరి–పులివెందుల రహదారి సమీపంలోని బట్రేపల్లి జలపాతం కళ సంతరించుకుంది. పైనుంచి జాలువారుతున్న నీటితో హొయలొలికిస్తోంది. జలపాతాన్ని చూడడానికి తలుపుల మండలవాసులే కాకుండా కదిరి, పులివెందుల తదితర ప్రాంతాల నుంచి ప్రజలు వస్తున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా సందడిగా మారింది.

అక్రమ రవాణాపై ఉక్కుపాదం

- పేదల బియ్యం పక్కదారి పట్టకుండా నిఘా
- జనవరి నుంచి ఇప్పటి వరకు 136 కేసులు
- 6,305.09 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం

- ఈ ఏడాది మే నెలలో అక్రమంగా రవాణా చేస్తున్న 40 క్వింటాళ్ల బియ్యాన్ని ఉరవకొండ పట్టణం గుంతకల్లు రోడ్డులోని మల్లేశ్వరి సినిమా థియేటర్ సమీపంలో విజిలెన్స్, పౌర సరఫరాల అధికారులు పట్టుకున్నారు. ఇందులో ముగ్గురు వ్యక్తులపై 6ఏ కేసుతో పాటు క్రిమినల్ కేసు నమోదు చేశారు.



- ఈ ఏడాది మార్చి నెలలో గుంతకల్లు పట్టణంలో పామిడి–గుంతకల్లు రహదారిలోని ఇందిరమ్మ కాలనీలోని ఇంటి (ఇంటి నెంబరు 158, 159) ఆవరణలో అక్రమ రవాణాకు సిద్ధంగా ఉంచిన 249.30 క్వింటాళ్ల బియ్యాన్ని విజిలెన్స్, పౌర సరఫరాల అధికారులు పట్టుకున్నారు. ఐదుగురు వ్యక్తులపై 6–ఏ కేసుతో పాటు కిమినల్ కేసు నమోదు చేశారు.

అనంతపురం అర్బన్: దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న పేదలకు ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా నాణ్యమైన, బలవర్ధకమైన ఫోర్టిఫైడ్ బియ్యాన్ని అందిస్తోంది. అయితే పేదల ఆర్థిక అవసరాలను ఆసరా చేసుకుని వ్యాపారులు బియ్యం తక్కువ ధరకు (కిలో రూ.12 నుంచి రూ.15 చొప్పున)సేకరిస్తున్నారు. అలా సేకరించిన బియ్యాన్ని ఇతర రాష్ట్రాల్లో మూడు రెట్లకు అధికంగా (రూ.40 నుంచి రూ.50 దాకా) విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వీటిని గమనించిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పౌరసరఫరాల అధికారులు అక్రమార్కులపై ఉక్కుపాదం మోపుతున్నారు. ప్రత్యేక నిఘా ఉంచి అందిన సమాచారం మేరకు దాడులు చేస్తున్నారు. బియ్యం అక్రమ రవాణాకు పాల్పడుతున్న వ్యక్తులపై 6–ఏ కేసులు నమోదు చేస్తున్నారు. ఇలా ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 136 కేసులు నమోదు చేసి, 6,305.09 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. పేదలకు అందించే బియ్యంపై ప్రభుత్వం కిలోకు రూ.38.50 ఖర్చు చేస్తోంది. అధికారులు స్వాధీనం చేసుకున్న బియ్యం విలువ ప్రభుత్వ లెక్కల ప్రకారం రూ.2,42,74,250 ఉంటుంది.

అక్రమ రవాణాదారులపై కేసులు



ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు ప్రభుత్వం సబ్సిడీతో బియ్యం ఇస్తోంది. ఇలా సబ్సిడీతో పొందిన వస్తువులను తిరిగి విక్రయించడం చట్ట ప్రకారం నేరం. అదే క్రమంలో ప్రభుత్వం సబ్సిడీ ద్వారా పేదలకు ఇస్తున్న బియ్యాన్ని కొనుగోలు చేయడమూ నేరం. పేదల నుంచి బియ్యం కొనుగోలు చేసి అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారిపై 6ఏ కేసుతో పాటు క్రిమినల్ కేసు నమోదు చేస్తున్నాం.

– శోభారాణి, జిల్లా సరఫరాల అధికారి (డీఎస్‌ఓ)

చట్ట ప్రకారం నేరం

ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందిస్తున్న బియ్యాన్ని విక్రయించినా, కొనుగోలు చేసినా చట్టపరంగా నేరం. ఏపీ స్టేట్ టార్గెటెడ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ (కంటోల్) ఆర్డర్–2018లోని 19లోని క్లాజ్ జీ ప్రకారం తీవ్ర చర్యలు ఉంటాయి. బియ్యం అమ్మిన కార్డుదారులపై క్రిమినల్ చర్యలతో పాటు కార్డు రద్దు చేస్తారు. క్లాజ్ హెచ్ ప్రకారం బియ్యం కొనుగోలు చేసిన వ్యక్తులపై క్రిమినల్ కేసు నమోదు చేయడంతో పాటు జరిమానా విధిస్తారు.

యోగాసనాలు జీవితంలో భాగం కావాలి



యోగాసనం వేస్తున్న బాలిక

అనంతపురం కల్చరల్: మనిషిని సంపూర్ణ ఆరోగ్యవంతుడిగా తీర్చిదిద్దగల్గిన యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ శ్రీనివాసరావు అన్నారు. నగరంలోని షిరిడీనగర్‌లో గల వివేకానంద యోగా భవన్‌లో ఆదివారం వివేకానంద యోగా కేంద్రం ఆధ్వర్యంలో అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలకు చెందిన చిన్నారులకు యోగాసన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ప్రారంభించిన అనంతరం ముఖ్య అతిథి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులకు యోగా పట్ల ప్రత్యేక శ్రద్ధ కల్గించాలని సూచించారు. బీఎస్‌ఎన్‌ఎల్ రాజశేఖరరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మరో ముఖ్య అతిథి యువజన సంక్షేమ శాఖ అధికారి కేశవనాయుడు మాట్లాడారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ జిల్లాస్థాయి విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. సాయంత్రం ముగింపు వేడుకలకు డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి, ఆర్డీటీ ఇంజినీర్ శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో యోగా గురువులు కృష్ణవేణి, దివాకర్, మారుతీ ప్రసాద్, పూజారి శ్రీనివాసులు, సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.



హిందూపురంలో వినాయక నిమజ్జన శోభాయాత్రలో పాల్గొన్న భక్తజనం

వెళ్లిరావయ్యా.. బొజ్జగణపయ్యా

- హిందూపురంలో ఉల్లాసంగా గణేశ్ నిమజ్జనోత్సవం



క్రేన్ సాయంతో నిమజ్జనం



ఊరేగింపులో భారీ వినాయక విగ్రహాలు



గంగ ఒడికి చేరిన గణనాథుడు

ఉత్సాహం ఉరకలేసింది. విఘ్నవినాయకుడి నామస్మరణ మార్మోగింది. సర్వమత సామరస్యం వెల్లివిరిసింది. కొలువు దీరినప్పటి నుంచి విశేష పూజలందుకున్న లంబోదరుడు ప్రశాంత వాతావరణంలో గంగమ్మ ఒడికి చేరాడు. బొజ్జగణపయ్య నిమజ్జనోత్సవం ఆదివారం శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలో అంగరంగ వైభవంగా జరిగింది. పట్టణంలో వాడవాడలా కొలువుదీరిన గణనాథులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ట్రాక్టర్లు, ప్రత్యేక వాహనాల్లో నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా యువత ఆధ్యాత్మిక సాగరంలో మునిగిపోయారు. వాహనాల ముందు డీజే పాటలకు ఉల్లాసంగా డ్యాన్సులు చేస్తూ ముందుకు కదిలారు. చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ తన్మయత్వంతో హోరెత్తించారు. బాణ సంచా పేలుళ్ల నడుమ రంగులు చల్లుకుని సందడి చేశారు.

భారీ క్రేన్‌లతో నిమజ్జనం

గతేడాది కంటే ఈసారి భారీ వినాయకుడి విగ్రహాలు కొలువుదీరాయి. 20 అడుగులకు పైగా ఉన్న విగ్రహాలు 30 వరకూ ఏర్పాటు చేశారు. దీంతో వాటి నిమజ్జనానికి గుడ్డం కోనేరు వద్ద క్రేన్‌లు ఏర్పాటు చేశారు. అగ్నిమాపక, మున్సిపల్, పోలీసు సిబ్బంది సమన్వయంతో విగ్రహాలను ప్రశాంత వాతావరణంలో గంగమ్మ ఒడికి చేర్చారు.

– సాక్షి బృందం

క్లుప్తంగా

ఎలుగు బంటి సంచారం

కంబదూరు: మండల కేంద్రం శివారులో ఓ ఎలుగుబంటి హల్‌చల్ చేస్తోంది. మూడు రోజులుగా కంబదూరు గ్రామ సమీపంలోని క్వారీలో సంచరిస్తున్నట్లు స్థానికులు గుర్తించారు. శనివారం రాత్రి ఏకంగా గ్రామంలోకి ప్రవేశించడంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. అటవీ శాఖ అధికారులు స్పందించి ఎలుగుబంటిని బంధించాలని పలువురు కోరుతున్నారు.

'ఆపస్' నూతన కార్యవర్గం ఎంపిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యవర్గ సభ్యులు

రాప్తాడురూరల్: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నూతన కమిటీల ఎంపిక ప్రక్రియ ఆదివారం అనంతపురం లోని సరస్వతి విద్యా మందిరంలో నిర్వహించారు. రాష్ట్ర పరిశీలకులు కృష్ణార్జునరెడ్డి పర్యవేక్షణలో రెండు జిల్లాలకు కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతపురం జిల్లా అధ్యక్షురాలిగా కళ్యాణి, ప్రధాన కార్యదర్శిగా ఎర్రిస్వామి, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడిగా అమరా చంద్రబాబు, ప్రధాన కార్యదర్శిగా కె.సురేష్‌బాబు ఎన్నికయ్యారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర ప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నారాయణస్వామి, శ్రీసత్యసాయి జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్, కార్యదర్శి రమేష్, వెంకటేశులు, అనంతపురం జిల్లా ఉపాధ్యక్షుడు హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

కుమార్తెలతో సహా తల్లి ఆత్మహత్యాయత్నం

వజ్రకరూరు: మండలంలోని వెంకటాంపల్లి పెద్ద తండా (రూపానాయక్ తండా) గ్రామానికి చెందిన సాలమ్మబాయి తన కుమార్తెలు మమత, లక్ష్మీబాయితో కలసి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ కలహాల నేపథ్యంలో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆమె ఆదివారం ఇంట్లో ఉన్న పెట్రోల్ తాగింది. అనంతరం తన ఇద్దరు కుమార్తెలకూ తాపింది. తీవ్ర అస్వస్థతకు లోనై అపస్మారక స్థితికి చేరుకున్న వారిని స్థానికులు గమనించి 108 అంబులెన్స్ ద్వారా ఉరవకొండలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం.

పుంజుకున్న 'ఆర్టీసీ'

- ప్రత్యేక సర్వీసుల ద్వారా లాభాల బాట
- శ్రావణ మాసంలో అంచనాలకు మించిన ప్రగతి
- లక్ష్యానికి మించి సమకూరిన ఆదాయం



అనంతపురం సెంట్రల్: కొన్నేళ్లుగా నష్టాల భారం మోస్తూ వచ్చిన ఆర్టీసీ... రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత లాభాల బాటలో పయనిస్తోంది. ఓ వైపు కార్గో సర్వీసులను విస్తృతం చేస్తూనే... మరో వైపు ప్రత్యేక సర్వీసుల ద్వారా లాభాలు గడించేలా ప్రణాళికను ప్రజారవాణాశాఖ (పీటీడీ) అధికారులు రచించారు. ఈ ప్రణాళికను క్షేత్రస్థాయిలో అమలు చేస్తూ అంచనాలకు మించిన ప్రగతి సాధిస్తున్నారు.

నేను విన్నాను... నేను ఉన్నాను

ఒకప్పుడు ఆర్టీసీ అంటే స్టేజ్ టు స్టేజ్‌కు ప్రయాణికులను చేరవేయడమే పనిగా ఉండేది. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఆర్టీసీలో సమూల మార్పులు చోటు చేసుకుంటూ వచ్చాయి. ప్రతిపక్ష నేతగా తాను చేపట్టిన ప్రజాసంకల్ప పాదయాత్రలో ఆర్టీసీ కార్మికుల కష్టాలను విన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి... ఆ రోజుల్లోనే 'నేను విన్నాను... నేను ఉన్నాను' అంటూ భరోసానిస్తూ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీని ప్రభుత్వంలోకి విలీనం చేసి కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణిస్తామని భరోసానిచ్చారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అతి కొద్ది కాలంలోనే ఆర్టీసీని ప్రభుత్వంలోకి విలీనం చేసి కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపారు. ఈ నేపథ్యంలో డ్రైవర్లు, కండక్టర్ల పనితీరులోనూ స్పష్టమైన మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రతి స్టేజ్‌లోనూ బస్సులను విధిగా ఆపుతూ ప్రయాణికులను ఎక్కించుకుని గమ్యస్థానాలకు చేరుస్తుండడంతో ఆర్టీసీ బస్సు ప్రయాణంపై ప్రజలు మక్కువ పెంచుకున్నారు. దీనికి తోడు కార్గో సేవలను అందుబాటులోకి తీసుకురావడంతో నిర్దేశించుకున్న లక్ష్యానికి మించి ఈ సారి అనంతపురం రీజియన్ ఆదాయం గడించింది.

లాభాల శ్రావణం..

ఈ ఏడాది శ్రావణ మాసంలో నిర్వహించిన ప్రత్యేక సర్వీసుల ద్వారా ఆర్టీసీకి అంచనాలకు మించి ఆదాయం సమకూరింది. ఓ వైపు వివాహాది శుభ కార్యాలకు అద్దెకు బస్సులను కేటాయిస్తూనే, మరో వైపు పుణ్యక్షేత్రాల సందర్శనకు వెళ్లే వారి సౌకర్యార్థం ప్రత్యేకంగా బస్సు సర్వీసులను నడపడం ద్వారా కిలోమీటర్‌కు రూ.40.36 ఆదాయం గడించాలని లక్ష్యంగా నిర్దేశించుకోగా... 24 పైసలు అధికంగా రూ.40.60 చొప్పున అధిక ఆదాయం సమకూరింది. శ్రావణ మాసంలో మురడి, నేమకల్లు, కసాపురం గ్రామాల్లో వెలసిన ఆంజనేయస్వామిని ఒకే రోజు దర్శించుకుని వచ్చేలా హనుమాన్ దర్శన్ పేరుతో బస్సు సర్వీసులు నడిపారు. అలాగే ప్రతి పౌర్ణమికి అరుణాచలంలో జరిగే గిరి ప్రదక్షిణకు జిల్లాలోని అన్నిడిపోల నుంచి ప్రత్యేక బస్సులను అధికారులు నడుపుతున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకూ 1,678.32 లక్షల కిలోమీటర్లు తిరగడం లక్ష్యంగా నిర్దేశించుకోగా, ఇప్పటి వరకూ 1,560.15 లక్షల కిలోమీటర్ల మేర బస్సులను అధికారులు తిప్పారు.

శ్రావణ మాసంలో బస్సుల ప్రయాణ దూరం (లక్షల కిలోమీటర్లలో)

డిపో	లక్ష్యం	ప్రగతి
అనంతపురం	18.41	17.87
గుత్తి	4.46	4.14
గుంతకల్లు	9.56	8.18
కళ్యాణదుర్గం	11.03	10.94
రాయదుర్గం	10.01	10.21
తాడిపత్రి	17.70	17.18
ఉరవకొండ	8.75	8.15

ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకూ ఒక కిలోమీటరుకు గడించిన ఆదాయం

డిపో	లక్ష్యం	ప్రగతి
అనంతపురం	రూ.40.23	రూ.40.65
గుత్తి	రూ.39.96	రూ.38.91
గుంతకల్లు	రూ.40.78	రూ.36.24
కళ్యాణదుర్గం	రూ.39.02	రూ.39.72
రాయదుర్గం	రూ.40.18	రూ.41.81
తాడిపత్రి	రూ.42.35	రూ.41.26
ఉరవకొండ	రూ.38.56	రూ.38.54

సమష్టి కృషితో సాధ్యం

ఈ శ్రావణ మాసంలో ఆర్టీసీకి మంచి లాభాలు వచ్చాయి. నిర్దేశించుకున్న లక్ష్యానికి మించి ఆదాయం తీసుకువచ్చాం. ఆర్టీసీలో ప్రతి అధికారి సమష్టిగా కృషి చేయడం వల్లనే ఇది సాధ్యమైంది. ప్రత్యేకించి కండక్టర్లు, డ్రైవర్ల చొరవ చాలా ఉంది. దీనికి తోడు వివాహాలు, పుణ్యక్షేత్రాల సందర్శనకు ప్రత్యేక సర్వీసులను అందుబాటులోకి తీసుకువచ్చాం. ఈ స్ఫూర్తితోనే భవిష్యత్‌లో మరింత ఆదాయం తీసుకువచ్చేలా ప్రణాళికబద్ధంగా వ్యవహరిస్తాం.

– సుమంత్.ఆర్.ఆదోని, జిల్లా ప్రజారవాణాధికారి

నిబంధనలు పాటించండి : డీపీఓ



పంచాయతీ కార్యదర్శులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న డీపీఓ ప్రభాకరరావు

అనంతపురం రూరల్: పంచాయతీ నిబంధనలు పక్కాగా పాటిస్తూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కార్యదర్శులకు జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) ప్రభాకరరావు సూచించారు. అనంతపురం నగర శివారులోని టీటీడీసీలో పంచాయతీ కార్యదర్శులకు ఏర్పాటు చేసిన నాల్గో విడత శిక్షణ ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రభాకరరావు మాట్లాడుతూ.. శిక్షణలో నేర్చుకున్న అంశాలను అనుసరిస్తూ ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. పంచాయతీల పరిధిలో కొత్త లే అవుట్ల ఏర్పాటు విషయంలో అప్రమత్తత అవసరమన్నారు. జగనన్న భూ హక్కు – భూ రక్ష పథకంలో భాగంగా గ్రామ కంఠంలో ఇళ్ల పట్టాల పంపిణీ, అభివృద్ధి పనులపై ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

వజ్రకరూరు: మండలంలోని కమలపాడు గ్రామానికి చెందిన మైనర్ బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జ్ ఎస్‌ఐ వెంకటస్వామి తెలిపారు. ఈ నెల 18న సాయంత్రం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన బాలిక తిరిగి రాలేదు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు పేర్కొన్నారు.

టీటీ రాష్ట్ర చాంపియన్‌గా శాన్వి



శ్రీ శాన్వి

అనంతపురం: విశాఖపట్నం వేదికగా సాగుతున్న రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో అండర్–13 విభాగంలో అనంతపురానికి చెందిన శ్రీశాన్వి ప్రథమ స్థానం సాధించి చాంపియన్ షిప్‌ను దక్కించుకుంది. వరుసగా నాలుగో సారి ఆమె రాష్ట్ర చాంపియన్‌గా నిలవడం గమనార్హం. అలాగే అండర్–15 విభాగంలో ద్వితీయ స్థానం దక్కించుకుంది.

పాము కాటుతో బాలుడి మృతి

పావగడ: తాలూకాలోని నాగలమడక హోబళి క్యాతగానకెరె గ్రామానికి చెందిన అంజినప్ప కుమారుడు ఆకాష్(7) పాము కాటుతో మృతి చెందాడు. శనివారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా పాము కాటు వేసింది. కాసేపటి తర్వాత తనకు కడుపు నొప్పిగా ఉందని బాలుడు ఏడుస్తుంటే వెంటనే తల్లిదండ్రులు ఉపశమన చర్యలు చేపట్టారు. ఆ సమయంలో దిండు (తలగడ) కింద నుంచి పాము బయటకు రావడంతో కాటు వేసినట్లుగా నిర్ధారించుకుని వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం తుమకూరుకు తీసుకెళుతుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఘటనపై తిరుమణి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

టీడీపీ పని అయిపోయింది

- చంద్రబాబు అరెస్ట్‌పై ఎక్కడేగాని సానుభూతి లేదు
- కుల రాజకీయం చేసి లబ్ధి పొందాలని చూస్తున్నారు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా, మాజీ ఎమ్మెల్యే విశ్వ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ ధ్వజం



మాట్లాడుతున్న పైలా నరసింహయ్య (చిత్రంలో) జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్

బెళుగుప్ప: రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ పని అయిపోయిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య అన్నారు. వైఎస్సార్‌సీపీ బెళుగుప్ప మండల నూతన కమిటీ ప్రమాణస్వీకారోత్సవం ఆదివారం స్థానిక వాసవి కల్యాణమంటపంలో అట్టహాసంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పైలా నరసింహయ్యతో పాటు జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాడు సీఎం పదవిలో ఉన్న ఎన్టీఆర్‌ను తన స్వార్థం కోసం దించేసిన పాపం చంద్రబాబును వెన్నాడి నేడు జైలు పాలయ్యేలా చేసిందన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రజాధనాన్ని దోచుకుని దాచుకున్న చంద్రబాబు చివరకు స్కిల్ స్కామ్‌లో అడ్డంగా దొరికిపోయారన్నారు. ఈ దోపిడీ తెలుసుకున్న ఆ పార్టీ కార్యకర్తలు సైతం చంద్రబాబుపై కనీస సానుభూతి కూడా చూపడం లేదన్నారు. దీంతో కుల రాజకీయాలకు తెరలేపి లబ్ధి పొందాలనుకుంటున్నారన్నారు. వలంటీర్ల వ్యవస్థను తప్పుబడుతూ బానిస బతుకులుగా చిత్రీకరించిన ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ తన వాస్తవ నైజాన్ని బయటపెట్టుకున్నారన్నారు. సేవా గుణంతో కరోనా విపత్కర పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొన్న వలంటీర్లు దేశవ్యాప్తంగా మన్ననలు పొందారనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సంక్షేమ పథకాలను ఇంటి వద్దకే చేరవేస్తూ అవినీతి రహిత పాలనను సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్ల ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక అసత్య ఆరోపణలు చేయడం సబబు కాదన్నారు. కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర, ఎంపీపీ పెద్దన్న, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు వీరన్న, పార్టీ మండల కన్వీనర్ మచ్చన్న, జేసీఎస్ చైర్మన్ శ్రీనివాస్, సహకార సంఘం అధ్యక్షుడు శివలింగప్ప, బెస్త, చేనేత కార్పొరేషన్ డైరెక్టర్లు రమణ, కోదండ తదితరులు పాల్గొన్నారు.

దమ్ముంటే సీబీఐ విచారణ కోరండి

అనంతపురం కార్పొరేషన్: స్కిల్ స్కాంలో అడ్డంగా దొరికిపోయినందుకే చంద్రబాబు జైలులో ఊచలు లెక్కపెడుతున్నారని, దీనికి టీడీపీ నాయకులు నానా యాగీ చేస్తుండడం సిగ్గు చేటని పైలా నరసింహయ్య అన్నారు. ప్రజాధనాన్ని చంద్రబాబు దోచుకోలేదంటున్న టీడీపీ నాయకులకు దమ్ముంటే సీబీఐ విచారణ కోరుకోవాలని సవాల్ విసిరారు. జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికారంలో ఉంటూ చంద్రబాబు ప్రవేశపెట్టిన ప్రతి స్కీమూ ఓ స్కామ్‌గానే తేలిందన్నారు. ప్రస్తుతానికి స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ ఒక్కటే వెలుగు చూసిందని, రానున్న రోజుల్లో పోలవరం, ఫైబర్ గ్రిడ్, నీరు–చెట్టు, చింతలపూడి ఎత్తిపోతల పథకం, గోదావరి–పెన్నా నదుల అనుసంధానం, అమరావతి రాజధాని నిర్మాణానికి సంబంధించి క్విడ్‌ప్రో తదితర వాటిలో రూ.వేల కోట్ల అవినీతి కుంభకోణాలూ వెలుగు చూస్తాయన్నారు. వీటిపై విచారణ జరిగి చంద్రబాబుకు శిక్ష పడితే అనుభవించేందుకు ఆయన జీవితకాలం సరిపోదన్నారు.

సంపులో పడి బాలుడి మృతి



కార్తీక్‌రెడ్డి (ఫైల్)

తాడిమర్రి: వ్యవసాయ నీటి సంపులో పడి ఓ బాలుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... తాడిమర్రి మండలం గుడ్డంపల్లికి చెందిన జంబులూరు ప్రతాప్‌రెడ్డి, త్రివేణి దంపతులకు ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. పెద్దకోట్లలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న కుమారుడు కార్తీక్‌రెడ్డి (10) ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో తల్లిదండ్రులతో కలసి తోట వద్దకెళ్లాడు. మధ్యాహ్నం ప్రతాప్‌రెడ్డి వేరుశనగ పంటను ఆరబోసి నిద్రపోతుండగా, అమ్మ త్రివేణి పొలం పనుల్లో నిమగ్నమైంది. అదే సమయంలో తాగునీటి కోసం సంప్ వద్దకెళ్లిన కార్తీక్ రెడ్డి అదుపు తప్పి అందులో పడిపోయాడు. లోతు ఎక్కువగా ఉండడంతో నీట మునిగి ఊపిరి అందక మృతి చెందాడు. మధ్యాహ్నం భోజనం చేసేందుకు రమ్మంటూ తల్లిదండ్రులు కేకలు వేసి పిలిచినా కుమారుడి నుంచి స్పందన లేకపోవడంతో గాలిస్తూ సంప్ వద్దకు చేరుకున్నారు. నీటిలో విగతజీవిగా తేలుతున్న కుమారుడిని చూసి ఆందోళనతో సంప్‌లోకి దిగారు. అయితే సంప్ నుంచి వారు సైతం బయటకు రాలేకపోవడంతో చుట్టుపక్కల రైతులు అక్కడకు చేరుకుని బయటకు లాగారు. అప్పటికే కుమారుడు మృతిచెందినట్లు నిర్ధారించుకున్న తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని ఘటనపై ఆరా తీసి, కేసు నమోదు చేశారు.

హత్య కేసులో మరో 8 మంది అరెస్ట్



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

ముదిగుబ్బ: మండలంలోని దొరిగిల్లు క్వార్టర్స్‌లో ఈ నెల 20న చోటు చేసుకున్న మంజుల అనంతయ్య హత్య కేసులో మరో ఎనిమిది మంది నిందితులను పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. వివరాలను సీఐ యతీంద్ర వెల్లడించారు. ఇప్పటికే ఈ కేసులో ఈ నెల 21న తొమ్మిది మందిని పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. తాజాగా చెడిపోతుల మనోహర్, కమతం చంద్రశేఖర్, చెడిపోతుల చంద్రశేఖర్, చీమల పవన్‌కుమార్, చీమల ప్రసాద్, గౌరవ సునీల్, చెడిపోతుల బాలచంద్రుడు, చెడిపోతుల విజయ్‌కుమార్‌ను అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

పఠనాసక్తి పెంపొందేలా పుస్తకాలు

- తొలివిడతగా ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు అందజేత
- జిల్లాకు చేరిన 1,386 సెట్లు
- ఒక్కో సెట్‌లో 29 రకాల పుస్తకాలు



సమగ్రశిక్ష కార్యాలయంలో భద్రపరిచిన పాఠశాలల లైబ్రరీ పుస్తకాలు

రాప్తాడు రూరల్: పుస్తక పఠనం విద్యార్థి మేథోశక్తి పెంపునకు దోహదపడుతుందని అనేక అధ్యయనాలు వెల్లడించాయి. ఇందులో భాగంగా విద్యార్థుల్లో పఠనాశక్తిని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో 1 నుంచి ఇంటర్ వరకూ అన్ని తరగతుల విద్యార్థులకు ఉపయోగపడేలా పాఠశాలల గ్రంథాలయాలకు పుస్తకాలను సమకూరుస్తోంది. పాఠశాలల్లో తప్పనిసరిగా వారానికి ఒక పీరియడ్‌ను పుస్తక పఠనానికి కేటాయించేలా ఆదేశాలు జారీ అయ్యాయి.

జిల్లాకు చేరుతున్న పుస్తకాలు..

జిల్లాలోని 1,182 ప్రాథమిక పాఠశాలలకు ఒక్కో పాఠశాలకు 29 టైటిళ్లతో కూడిన బుక్ సెట్, 204 ప్రాథమికోన్నత పాఠశాలలకు సంబంధించి ఒక్కో పాఠశాలకు 29 బుక్‌లతో కూడిన సెట్లు జిల్లా కేంద్రానికి చేరాయి. మొత్తం 1,386 పుస్తకాల సెట్లను అధికారులు సమగ్రశిక్ష కార్యాలయంలోని గోదాములో భద్రపరిచారు. ప్రాథమిక పాఠశాలలకు 51 బుక్‌ల సెట్లు, ప్రాథమికోన్నత పాఠశాలలకు 91 బుక్‌లతో కూడిన సెట్లు రావాల్సి ఉంది. 303 ఉన్నత పాఠశాలలకు 88 బుక్‌లతో కూడిన సెట్లు రానున్నాయి. 59 జూనియర్ కళాశాలలకు 77 బుక్‌లతో కూడిన సెట్లు రావాల్సి ఉంది. ఇవన్నీ వచ్చిన తర్వాత జిల్లా కేంద్రం నుంచి మండల కేంద్రాలకు పంపుతారు. అక్కడి నుంచి పాఠశాలలకు సరఫరా చేయనున్నారు.

విద్యార్థులకు చాలా ఉపయోగకరం..

లైబ్రరీ పుస్తకాలు విద్యార్థులకు చాలా ఉపయోగకరంగా ఉంటాయని డీఈఓ నాగరాజు అన్నారు. అభ్యాసన స్థాయిలు మెరుగుకు ఇవి దోహదపడతాయన్నారు. వారంలో ఒక పీరియడ్‌ను తప్పనిసరిగా లైబ్రరీలోని పుస్తకాలను చదివించేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.

కొనసాగిన మిక్స్‌డ్ జండర్ క్రికెట్ టోర్నీ

అనంతపురం: ఆర్డీటీ, అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఏపీఎల్ క్రికెట్ లీగ్ టోర్నీ కొనసాగుతోంది. రెండో రోజు ఆదివారం అనంతపురం, తపోవనం క్రికెట్ ట్రైనింగ్ సెంటర్, కళ్యాణదుర్గం, నార్పల, ఆత్మకూరు, జట్లు టోర్నీలో పాల్గొన్నాయి. వచ్చే వారంలోనూ టోర్నీ కొనసాగనున్నట్లు ఆర్డీటీ కోచ్ యోగానంద రెడ్డి తెలిపారు.

రెవెన్యూ రికార్డులు చూసి మాట్లాడండి


- ఎవరి భూములూ లాక్కోలేదు
- ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి



మాట్లాడుతున్న ఆలూరి సాంబశివారెడ్డి

యల్లనూరు: టీడీపీ హయాంలో ఇచ్చిన పట్టాను ఇప్పుడు సమస్యగా సృష్టించి ఎమ్మెల్యే మీద రుద్దడం సబబు కాదని రాష్ట్ర ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి అన్నారు. ఆదివారం యల్లనూరులో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. యల్లనూరు మండలం 85 నిట్టూరు గ్రామంలో జగనన్న భూహక్కు పత్రాలను అందజేసిన విషయం తెలిసిందేనన్నారు. ఇందులో భాగ్యమ్మ, మరియమ్మ ప్రస్తావించిన భూ సమస్యతో అసలు సంబంధం లేదన్నారు. గత ప్రభుత్వంలో అందజేశారని, అనుమానం ఉంటే రెవెన్యూ రికార్డులు పరిశీలించుకోవాలని హితవు పలికారు. ఈ సమస్యను ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి దృష్టికి తీసుకెళ్లామని, ఆమె తక్షణమే స్పందించి రికార్డులు పరిశీలించాలని తహసీల్దారు సుమతిని ఆదేశించారని తెలిపారు. అర్హులైన వారికే పట్టా దక్కుతుందన్నారు. రాజకీయ లబ్ధి కోసం ఈ అంశానికి కులం రంగు అద్ది గ్రామాల్లో కక్షలు రేకెత్తించేలా కథనాలు ప్రచురించే ధోరణికి ఇప్పటికైనా పచ్చ పత్రికలు స్వస్తి పలకాలన్నారు. ఎమ్మెల్యే పద్మావతికి సాయం చేయడం తప్ప.. అన్యాయం చేయడం రాదన్నారు. జగనన్న ప్రభుత్వంలో ఎక్కువ మంది దళితులే లబ్ధి పొందారన్నారు. ఎవరి భూములను లాక్కోలేదనే విషయాన్ని గుర్తించి పిచ్చి రాతలు ప్రచురించడం మానుకోవాలని, లేకపోతే ప్రజాగ్రహానికి గురి కావాల్సి ఉంటుందని పచ్చమీడియాను హెచ్చరించారు.

విషాదంలోనూ నేత్రదానం




నేత్రాలను దానం చేస్తున్న కుటుంబ సభ్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని శివానగర్‌లో కోళ్లమొరం రామకృష్ణారెడ్డి(65) ఆదివారం గుండెపోటుతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న విశ్వదీప సేవా సంఘం సభ్యులు... మృతుడి కుటుంబ సభ్యులను కలసి నేత్రదానంపై అవగాహన కల్పించారు. దీంతో మరణానంతరం కూడా జీవించి ఉండాలనే తపనతో రామకృష్ణారెడ్డి నేత్రాలను దానం చేసేందుకు మృతుడి భార్య సుబ్బమ్మ, కుమారులు చెన్నకేశవరెడ్డి, చిన్న కృష్ణారెడ్డి, కుమార్తెలు సుజాత, లక్ష్మి, అల్లుడు వీరారెడ్డి ముందుకు వచ్చారు. దీంతో నేత్రాలను ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి నిపుణుడు నాగరాజు సేకరించారు. ఈ సందర్భంగా విశ్వదీప సేవా సంఘం వ్యవస్థాపకుడు కోళ్లమొరం చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యక్షుడు గాజుల సురేష్ మాట్లాడుతూ.. రామకృష్ణారెడ్డి నేత్రాలను మరో ఇద్దరికి అమర్చడం ద్వారా వారి జీవితాల్లో వెలుగులు నిండనున్నాయన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు మాధవ, ప్రభాకరరెడ్డి, కేశవరెడ్డి పాల్గొన్నారు.


సంతల ఆదాయం రూ.4.28 లక్షలు

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఈ వారం జరిగిన పశువులు, జీవాల సంతల ద్వారా రూ.4.28 లక్షలకు పైగా ఆదాయం వచ్చినట్లు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, సెక్రటరీ ఆర్.జయలక్ష్మి తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత నుంచి రూ.2,16,450 వసూలు అయ్యిందని, ఆదివారం జరిగిన పశువుల సంత నుంచి రూ.2,12,270 మేర వసూలైనట్లు తెలిపారు.

యువకుడి దుర్మరణం



శశికుమార్ (ఫైల్)



గాయపడిన కార్తికేయ

ముదిగుబ్బ: కల్వర్టును కారు ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... బత్తలపల్లికి చెందిన శశికుమార్ (24), పరిగి మండలం నారేపల్లికి చెందిన మహేష్‌తో పాటు మరో యువతి కార్తికేయ సొంత పనిపై ఆదివారం అన్నమయ్య జిల్లా మదనపల్లికి కారులో బయలుదేరారు.ముదిగుబ్బ సమీపంలోని మల్లక్క కొట్టాల వద్దకు చేరుకోగానే కారు వేగాన్ని నియంత్రించుకోలేక రోడ్డు పక్కనే ఉన్న కల్వర్టును ఢీకొన్నారు. ఘటనలో కారులో ముందు సీటులో కూర్చొన్న శశికుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. కార్తికేయకు తీవ్ర గాయాల కాగా, స్వల్ప గాయాలతో మహేష్ బయటపడ్డాడు. క్షతగాత్రులను స్థానికులు కాపాడి 108 అంబులెన్స్ ద్వారా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరుడికి పంచామృతాభిషేకాలు


ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆత్మకూరు: పంప నూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ఆదివారం పంచామృతాభిషేకాలు చేశారు. స్వామిని పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి, పూజలు చేశారు. ఆలయంలో ఆకుపూజ , కాలసర్పదోష రాహుకేతు హోమాలు నిర్వహించారు. ఆలయంలోని మంజునాథస్వామి, పార్వతీదేవికి పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.


అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకులు రామాచార్యులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజ వంటి ప్రత్యేక పూజలు చేశారు.చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చి స్వామి, 108 శివలింగాలను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు.

26న నారాయణపురంలో పైలెట్ క్యాంపు

అనంతపురం మెడికల్: జగనన్న ఆరోగ్య సురక్షకు సంబంధించి ఈ నెల 26న రూరల్ పరిధిలోని ఏ నారాయణపురంలో పైలెట్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబ దేవి ఆదివారం తెలిపారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ఈ నెల 25న నగరంలోని హమాలీ కాలనీ, ఏ నారాయణపురంలో పైలెట్ క్యాంపును నిర్వహించాల్సి ఉందన్నారు. అయితే రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రూరల్ ప్రాంతంలో పైలెట్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మొక్కలను సంరక్షిద్దాం


37వ డివిజన్‌లో మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ అనిల్‌కుమార్ రెడ్డి

అనంతపురం కార్పొరేషన్: మొక్కలను సంరక్షించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకురావాలని కార్పొరేటర్ అనిల్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని 37వ డివిజన్‌లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు మొక్కలను సంరక్షించడం ద్వారా డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దొచ్చని కార్పొరేటర్ అన్నారు. అనంతరం స్థానికులు కార్పొరేటర్‌ను సన్మానించారు.

108 వాహనంలో ప్రసవం


108 వాహనంలో జన్మించిన మగబిడ్డను చూపుతున్న సిబ్బంది

ఆత్మకూరు: మండలంలోని తోపుదుర్తి గ్రామానికి చెందిన శ్రీలత 108 వాహనంలో ప్రసవమైంది. వివరాలు..
గ్రామానికి చెందిన జోగీశ్వర్ భార్య శ్రీలతకు నెలలు నిండి, పురిటినొప్పులు వచ్చాయి. కుటుంబ సభ్యులు 108 వాహనంలో ఆదివారం రాత్రి అనంతపురం సర్వజనాస్పత్రికి తీసుకెళ్తున్నారు. తీరా రంగంపేట వద్దకు రాగానే ఆమెకు నొప్పులు అధికమయ్యాయి. దీంతో 108 వాహన మెడికల్ టెక్నీషియన్ రమేష్, పైలెట్ సతీష్.. ప్రసవం చేశారు. ఆ సమయంలో చీకటిగా ఉండి, వర్షం కురుస్తోందని, సురక్షితంగా ప్రసవం అవుతుందోలేదోనని కుటుంబ సభ్యులు భయాందోళనకు గురయ్యారు. ఎలాంటి సమస్య లేకుండా శ్రీలత పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది.

పోతలయ్యస్వామికి ప్రత్యేక పూజలు

కనగానపల్లి: మండలంలోని దాదులూరులో వెలసిన పోతలయ్యస్వామికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి, స్వామికి బోనాలు సమర్పించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, పోతలయ్య, చెన్నేకేశవస్వామిని దర్శించుకున్నారు.

మతలబేమిటో..!

- ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలేవి?
- ఎక్స్‌పర్ట్ కమిటీ నివేదికలను తొక్కిపెట్టిన ఆరోగ్యశాఖ
- కలెక్టర్‌కు నివేదించని అధికారులు
- నగరంలోని వివిధ ఆస్పత్రుల్లో మాతా, శిశు మరణాలు

మాతాశిశు మరణాలను నియంత్రించేందుకు ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటోంది. మాతాశిశు మరణాల్లో ఆస్పత్రుల నిర్లక్ష్యం కనిపిస్తే మార్గదర్శకాల మేరకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అయితే జిల్లా కేంద్రంలోని కొన్ని ఆస్పత్రుల్లో ఇటీవల జరిగిన మాతాశిశు మరణాల విచారణకు సంబంధించి ఆరోగ్యశాఖ నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎక్స్‌పర్ట్ కమిటీ నివేదికలను కూడా తొక్కిపెట్టినట్లు విశ్వసనీయ సమాచారం.

– అనంతపురం మెడికల్:

మాతా, శిశు మరణాలు వివాదాస్పదం

- ఈ ఏడాది జూలై 31న నగరంలోని రాంనగర్‌లోని మున్సిపల్ ఆర్డీ కార్యాలయం సమీపంలో ఉన్న ఓ ఆస్పత్రిలో ప్రశాంతి (32) అనే బాలింత మృతి చెందింది.
- ఈ ఏడాది ఆగస్టు 1న నగరంలోని ఐదో రోడ్డుకు చెందిన కళ (భర్తపేరు షెక్షావలి) మూడో కాన్పు కోసం ఖాజానగర్‌లోని ఓ ఆస్పత్రిలో చేరింది.


డీఎంహెచ్ఓ కార్యాలయం

ఈ ఘటనకు ఆస్పత్రి నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతూ అప్పట్లో ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ డాక్టర్ యుగంధర్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

- ఈ ఏడాది ఆగస్టు 22న నగరంలోని బస్టాండ్ సమీపంలోని ఓ ఇన్‌ఫెర్టిలిటీ సెంటర్‌లో కర్నూలు జిల్లా జొహరాపురం గ్రామానికి చెందిన మోదిన్‌బీ (32) అనే మహిళ అనస్తీషియా వైద్యుడు ఇంజెక్షన్ ఇచ్చిన కాసేపటికే మృతిచెందింది. ఈ ఆస్పత్రుల్లో జరిగిన మాతాశిశు మరణాలు వివాదాస్పదానికి దారితీశాయి. ప్రైవేట్ ఆస్పత్రుల నిర్లక్ష్యంతోనే తల్లీబిడ్డ మృతి చెందారని మృతుల కుటుంబీకులు ఆస్పత్రుల ముందు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. కలెక్టర్ గౌతమి ఆదేశాలతో సర్వజనాస్పత్రి గైనిక్ హెచ్ఓడీ డాక్టర్ శంషాద్‌బేగం, అనస్తీషియా హెచ్ఓడీ డాక్టర్ నవీన్‌కుమార్, చిన్నపిల్లల విభాగం హెచ్ఓడీ డాక్టర్ రవికుమార్‌ను ఎక్స్‌పర్ట్ కమిటీ బృందంగా నియమించారు. వీరు ఆయా ఆస్పత్రుల్లో పలుమార్లు సంభవించిన మరణాలపై లోతుగా విచారణ చేపట్టి ఆరోగ్యశాఖ అధికారులకు నివేదిక సమర్పించారు. అందులో పలు ఆస్పత్రుల్లో లోపాలను గుర్తించినట్లు ఆరోగ్యశాఖ వర్గాలు తెలిపాయి.

ముందుకు సాగని విచారణ

గత నెల 1న నగరంలోని సాయినగర్ ఆరో క్రాస్‌లో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ఓ ఆస్పత్రిని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబదేవి సీజ్ చేశారు. ఆస్పత్రిలో అబార్షన్‌కు సంబంధించిన పరికరాలు ఉన్నాయని, 20 మంది వరకు మహిళలకు గర్భానికి సంబంధించి వైద్య సేవలందించినట్లు ఆరోగ్యశాఖ అధికారులు ప్రిస్కిప్షన్లను స్వాధీనం చేసుకున్నారు. నగరంలోని ఆదిమూర్తినగర్‌లోని సంజీవిని ఆస్పత్రి నిర్వాహకులు సైతం రెన్యూవల్ చేసుకోలేదు. దీంతోపాటు ఫైర్ ఎన్ఓసీ లేకుండానే ఆస్పత్రిని నడుపుతున్నట్లు గుర్తించి డీఎంహెచ్ఓ షోకాజ్ నోటీసు జారీ చేశారు.

నివేదిక సమర్పిస్తాం

నగరంలోని చంద్ర, సంజీవిని, ఎస్ఆర్‌కే ఆస్పత్రుల్లో జరిగిన ఘటనలపై కలెక్టర్‌కు నివేదిక సమర్పించాం. శివచైతన్య,స్నేహలత ఆస్పత్రుల్లో జరిగిన మరణాలకు మరోసారి ఎక్స్‌పర్ట్ కమిటీ నివేదికను పరిశీలించి, కలెక్టర్‌కు నివేదిస్తాం.
– డాక్టర్ ఈ భ్రమరాంబదేవి, డీఎంహెచ్ఓ

'బీఎస్ఎన్ఎల్‌ను కాపాడుకుందాం'

అనంతపురం సిటీ: ప్రభుత్వరంగ సంస్థ బీఎస్ఎన్ఎల్ (భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్)ను ఐక్యంగా కలసి కాపాడుకుందామని ఆ సంస్థ క్యాజువల్ కాంట్రాక్ట్ ఉద్యోగ, కార్మిక ఫెడరేషన్ ఏపీ సర్కిల్ ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రావు పిలుపునిచ్చారు. అనంతపురంలోని బీఎస్ఎన్ఎల్ సమావేశ మందిరంలో ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కరీం అధ్యక్షతన ఆదివారం సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా ప్రభాకర్‌రావు హాజరయ్యారు. అనంతరం జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

రేపు ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎంపిక

చెన్నేకొత్తపల్లి: ప్రభుత్వ ఉద్యోగుల తాలూకా కార్యవర్గం ఎన్నికను మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం సత్యసాయి, జిల్లా అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. చెన్నేకొత్తపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న ఈ సమావేశానికి రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి, మండలాల్లోని ప్రభుత్వ ఉద్యోగులు అందరూ తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

నెలాఖరులోపు ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలి

కనగానపల్లి: రైతులు ఖరీఫ్‌లో సాగు చేసిన పంటల వివరాలను ఈ నెలాఖరు లోపు ఈ క్రాప్ నమోదు చేయించకోవాలని ఏఓ కృష్ణకుమారి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల పరిధిలో ఈ– క్రాప్ నమోదు వేగంగా సాగుతోందన్నారు. ఇప్పటి వరకు సుమారు 75 శాతం మంది రైతులు ఈ–క్రాప్ నమోదు చేయించుకున్నారన్నారు. మిగిలిన రైతులు ఈ నెల 30 తేదీ లోపు పంటల వివరాలను నమోదు చేయించుకుంటే ప్రభుత్వం నుంచి రాయితీలు, పంట నష్టపరిహారం అందుతుందన్నారు.

హెల్మెట్ తప్పక ధరించాలి


వాహనదారులకు సూచనలు ఇస్తున్న ఎస్ఐ జనార్దన్

ఆత్మకూరు: ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఎస్ఐ జనార్దన్ వాహనదారులకు సూచించారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపేటప్పుడు ఏదైనా దురదృష్టవశాత్తూ ప్రమాదం జరిగితే ప్రాణాలకే ప్రమాదమని హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం వడ్డుపల్లి టోల్‌గేట్ వద్ద వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహన రికార్డులు పరిశీలించారు. వాహనదారులు లైసెన్స్‌లు తప్పక కలిగి ఉండాలన్నారు. చిన్నపిల్లలకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' సద్వినియోగం చేసుకోవాలి

అనంతపురం కార్పొరేషన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం 50వ డివిజన్ 68వ సచివాలయ పరిధిలోని అంధ బాలికల వసతి గృహంలోని అంధ బాలికలకు బీపీ, షుగర్, తదితర పరీక్షలు చేశారు. తమ వసతి గృహానికే వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించడం సంతోషంగా ఉందని, తమలాంటి వారి ఆరోగ్యం పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధిగా ఉందని పలువురు అంధ బాలికలు తెలిపారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటికే వివిధ డివిజన్ల పరిధిలో హెల్త్ స్క్రీనింగ్ నిర్వహించి, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వృద్ధులు, మహిళలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను గుర్తించినట్లు తెలిపారు. ఈ నెల 30 నుంచి జరిగే హెల్త్ క్యాంపుల్లో వీరికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులివ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంహెచ్ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డి, వసతి గృహం వార్డెన్ శ్రీనివాస్, కార్పొరేటర్ గురుశేఖర్‌బాబు, ఏఎన్ఎంలు గీత, మాలతి, ఆశా వర్కర్లు కుళ్లాయమ్మ, భాగ్య పాల్గొన్నారు.

గర్భిణుల సేవలపై నిర్లక్ష్యం

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని గైనిక్ విభాగంలోని కొందరు వైద్యులు గర్భిణులకు అందించే సేవలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. శింగనమల ప్రాంతానికి చెందిన గర్భిణి స్నేహలత (హైరిస్క్ ప్రెగ్నెన్సీ)కు అత్యవసరంగా సిజేరియన్ చేయాల్సి వచ్చింది. ఆ సమయంలో నొప్పులు అధికంగా రావడంతో ఆమెను లేబర్ వార్డు నుంచి అక్యూట్ మెడికల్ కేర్ పక్కనున్న ఎమర్జెన్సీ ఆపరేషన్ థియేటర్‌కు తీసుకెళ్లాల్సి వచ్చింది. గైనిక్ వైద్యులు ఎఫ్ఎన్ఓను జతచేసి స్ట్రెచర్‌పై ఈఓటీకి పంపారు. గర్భిణి భర్త ఆక్సిజన్ సిలిండర్ తోస్తుండగా, కుటుంబ సభ్యులు స్ట్రెచర్ తోసుకుంటూ ఈఓటీకి వెళ్లాల్సి వచ్చింది. ఆక్సిజన్ సిలిండర్‌ను సరిగా వినియోగించకుంటే మార్గంమధ్యలో గర్భిణికి ఏదైనా సమస్య వచ్చే అవకాశం ఉందని పలువురు చర్చించుకున్నారు.


గర్భిణిని ఆపరేషన్ థియేటర్‌కు తీసుకెళ్తున్న ఎఫ్ఎన్ఓ, కుటుంబీకులు

సేవాదృక్పథం అలవర్చుకోవాలి

- వన్ టౌన్ సీఐ రెడ్డప్ప

అనంతపురం క్రైం: సమాజంలోని ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం అలవర్చుకోవాలని అనంతపురం వన్ టౌన్ సీఐ రెడ్డప్ప అన్నారు. ఆదివారం పాతూరు స్వర్ణకారుల వీధిలో మిలాద్ ఉన్ నబీ (స్వ అలై)పండుగ సందర్భంగా సయ్యదా మాసుమా బీబీ సారా బీబీ దర్గా వద్ద కులమతాలకతీతంగా 12వ డివిజన్ వార్డు కార్పొరేటర్ జనబలం బాబా ఫక్రుద్దీన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సీఐ రెడ్డప్ప ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. దర్గాలో ప్రపంచ శాంతి కోసం ప్రత్యేక దువా ప్రార్థనలు జరిగాయి. అనంతరం అతిథులకు ఆత్మీయ సత్కారం నిర్వహించారు. కార్పొరేటర్ బాబా ఫక్రుద్దీన్ మాట్లాడుతూ నేటి తరుణంలో సమాజంలోని ప్రతి ఒక్కరూ సోదరభావంతో కలసిమెలసి సాగాలన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని సీఐ రెడ్డప్ప, కార్పొరేటర్ బాబా ఫక్రుద్దీన్ ప్రారంభించారు. కార్యక్రమంలో హఫీజ్ జబ్బార్, హాజీ ఖాదర్‌సాబ్, ఇక్బాల్, మాబు, ఫక్రుద్దీన్, యూనస్, జిలాన్, రియాజ్, పద్మాకర్, తదితరులు పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న సీఐ రెడ్డప్ప

28న మెగా రక్తదాన శిబిరాలు

గుంతకల్లుటౌన్: మిలాద్ ఉన్ నబీ పండుగను పురస్కరించుకుని ఈ నెల 28న రెడ్‌డ్రాప్ బ్లడ్ డోనర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని మూడు ప్రాంతాల్లో మెగా రక్తదాన శిబిరాలు నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఖాజీ అబ్దుల్ రజాక్ పీర్ సాహెబ్ తెలిపారు. ఆదివారం భాగ్యనగర్‌లోని మదరసాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రక్తదాన శిబిరాలకు సంబంధించిన ఫ్లెక్సీలను ఆయన ఆవిష్కరించారు. మున్సిపల్ ఆఫీస్, ఆర్ అండ్‌బీ సర్కిల్, పాతగుంతకల్లు మస్తాన్‌వలి దర్గా ఆవరణలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు శిబిరాలు నిర్వహిస్తామన్నారు. యువకులు, ఉత్సాహవంతులు రక్తదానం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మతపెద్దలు మన్సూర్ అలీసాహెబ్, రెడ్‌డ్రాప్ వ్యవస్థాపకుడు రెహమాన్, పట్టణాధ్యక్షుడు గులాం మహమ్మద్, ప్రధాన కార్యదర్శి షఫీ తదితరులు పాల్గొన్నారు.



ఫ్లెక్సీలను ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ ఖాజీ రజాక్‌పీర్ సాహెబ్

భూముల రీ-సర్వేతో శాశ్వత పరిష్కారం

పామిడి: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష కార్యక్రమం ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ ఆర్‌వీ సునితబాయి అన్నారు. ఆదివారం అప్పాజీపేట గ్రామంలో జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌తో పాటు వైఎస్సార్‌సీపీ మండల రూరల్ కన్వీనర్ కే నారాయణరెడ్డి, సర్పంచ్ రామాంజనేయులు మాట్లాడారు. భూముల రీ–సర్వేతో పొలంగట్లు, ఇతరత్రా తగాదాలు తొలగిపోతాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం రైతులకు ఎంతగానో దోహదపడుతోందన్నారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం రైతులకు జగనన్న శాశ్వత భూహక్కు పత్రాల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ జయప్ప, డిప్యూటీ తహసీల్దార్ జీ లక్ష్మీనారాయణరెడ్డి, ఆర్ఐ క్రాంతికుమార్, వీఆర్వో రమేష్, సర్వేయర్ నిరంజన్‌రెడ్డి, డీలర్ రామచంద్ర, రైతులు పాల్గొన్నారు.


రైతులకు భూహక్కు పత్రాలు అందిస్తున్న దృశ్యం

ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

చెన్నేకొత్తపల్లి: ఐసీడీఎస్ సెక్టార్ పరిధిలోని రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్ వాడీ ఆయా (హెల్పర్) పోస్టులకు అర్హులు ఈనెల 29లోపు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ కవితాదేవి ఆదివారం ఓ ప్రకటలో తెలిపారు. మొత్తం 8 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. రామగిరి మండలంలో గంగంపల్లి (ఎస్సీ), పోలేపల్లి–1 (ఓసీ) పోలేపల్లి–2 (బీసీ–ఈ), రామగిరి–2 (బీసీ–బీ) చెన్నేకొత్తపల్లి–1 (ఓసీ)గా రిజర్వేషన్లు ఖరారు చేశారు.

బాలికల మదరసా ప్రారంభం

ఉరవకొండ: స్థానిక జామాలుద్దీన్ ఖాద్రీ దర్గా ఆవరణలో జామీయ మసీదు ఎదురుగా నూతనంగా నిర్మించిన జామీయా తాసీరియా బాలికల మదరసాను ఆదివారం ప్రారంభించారు. సయ్యద్‌తాసీర్‌బాబా పర్యవేక్షణలో నిర్వహించే ఈ మదరాసాను ప్రత్యేక ప్రార్థనల అనంతరం సయ్యద్ అజ్మతుల్లా హుసేనీ, గుత్తి అన్వర్‌బాషా సాహెబ్, కుతుబుద్దీన్ తఖీ బాబా సాహెబ్, షకీబ్‌సాహెబ్ చేతుల మీదుగా ప్రారంభమైంది.

బైబై.. గణేశా!


వినాయకుడిని నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం

గార్లదిన్నె: మండల పరిధిలోని ట్రాక్టర్‌నగర్‌లో ఏడోరోజు ఆదివారం వినాయక విగ్రహ నిమజ్జనం కోలాహలంగా సాగింది. తొలుత ట్రాక్టర్ నగర్ సిబ్బంది కుటుంబ సభ్యులు, పిల్లలు భక్తి శ్రద్ధలతో వినాయకుడికి పూజలు చేశారు. అనంతరం ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ, డప్పువాయిద్యాల నడుమ వినాయకుడి విగ్రహాన్ని ఊరేగింపుగా గార్లదిన్నె మీదుగా తీసుకెళ్లి కెనాల్‌లో నిమజ్జనం చేశారు.

నిరాడంబరంగా మోదీ జన్మదిన వేడుకలు


రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం టవర్‌క్లాక్: నగరంలోని సంగమేశ్వర కల్యాణమంటపంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ మోదీ జన్మదిన వేడుకలను నిరాడంబరంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ చిరంజీవి రెడ్డి, శ్రీధర్, అశోక్‌రెడ్డి, కోనంకి శ్రీధర్, శివరుద్రయ్య, బీజేపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు


అలంకరణలో ముసలమ్మ తల్లి

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని ప్రముఖ అమ్మవారి ఆలయాల్లో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని ముసలమ్మ కట్ట వద్ద వెలసిన ముసలమ్మ తల్లి, కాశీ విశ్వేశ్వ ఆలయంలో కాశీ విశాలాక్షి అమ్మవార్లకు మహిళలు అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ముసలమ్మ తల్లి ఆలయంలో నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేపట్టారు.

బస్సులు 'బైపాస్' అవుతున్నాయి!

రాప్తాడులోకి బస్సులు పోవు... ఇక్కడే దిగేయండి!

- నియోజకవర్గ కేంద్రంలోకి వెళ్లని ఆర్టీసీ బస్సులు
- బైపాస్‌లోనే ప్రయాణికులను దించేస్తున్న డ్రైవర్లు, కండక్టర్లు
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు



బెంగళూరు నుంచి బైపాస్‌లోనే అనంతపురం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు


అనంతపురం నుంచి జాతీయ రహదారిపై బెంగళూరు వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు

రాప్తాడు: 'రాప్తాడులోకి బస్సులు వెళ్లవు.. హైవేలో దిగేయాల్సిందే..' అంటూ ఆర్టీసీ బస్సు డ్రైవర్లు, కండక్టర్లు నిత్యం ప్రయాణికుల పట్ల వ్యవహరిస్తున్న తీరు. నియోజకవర్గ కేంద్రమైన రాప్తాడులోకి ఆర్టీసీ బస్సులు వెళ్లకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రాప్తాడు నియోజకవర్గ కేంద్రం జిల్లా కేంద్రానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఆర్టీసీ బస్సులు హిందూపురం, బెంగళూరు, సత్యసాయి జిల్లా కేంద్రాలకు వెళ్లాలంటే రాప్తాడు మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. అయితే జాతీయ రహదారి నిర్మించినప్పటి నుంచి రాప్తాడు మీదుగా ఆర్టీసీ బస్సులు నడవడంలేదు. మండల కేంద్రం సమీపంలోని జాతీయ రహదారిపైనే నడుస్తున్నాయి. నియోజకవర్గ కేంద్రమైనా ఒక్క ఆర్టీసీ బస్సు కూడా నడవలేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం గ్రామాల్లోనే ఆర్టీసీ బస్సులు నడపాలని గతంలో రాప్తాడు గ్రామప్రజలు, ప్రజాప్రతినిధులు ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆర్టీసీ అధికారులు రాప్తాడు మీదుగానే ప్రతి ఆర్టీసీ బస్సు వెళ్లాలని సూచించారు. అయితే పల్లెవెలుగు తప్ప ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌లు అన్నీ బైపాస్ మీదుగానే వెళ్తున్నాయి. ఆర్టీసీ బస్సులు అనంతపురం నుంచి కలెక్టర్ ఆఫీస్, వయా ధర్మవరం పంగల్ రోడ్డు, రైల్వే గేట్, గంగలకుంట రోడ్డు సమీపంలోని సెరికల్చర్ ఆఫీసు, ఆర్టీటీ ఆఫీసు ముందు రోడ్డు నుంచి రాప్తాడు గ్రామం మీదుగా పెనుగొండ, హిందూపురం, బెంగళూరు, మడకశిర, ధర్మస్థలం, ఎం.బండమీదపల్లికి ఆర్డినరీ, ఎక్స్ ప్రెస్ సర్వీసులు రాకపోకలు సాగించేవి. అదేవిధంగా బెంగళూరు వైపు నుంచి వచ్చే బస్సులు రాప్తాడు మీదుగా అనంతపురానికి బస్సులు వెళ్తుండడంతో ప్రయాణికులకు సౌకర్యంగా ఉండేది. అయితే ఇటీవల రాప్తాడు 44వ జాతీయ రహదారి నుంచి గంగలకుంట రోడ్డు మీదుగా నూతనంగా నాలుగు వరుసల రహదారి వేశారు. దీంతో గ్రామంలోకి ఎం.బండమీదపల్లి పల్లె వెలుగు, ధర్మస్థలం, పెనుకొండ బస్సులు మాత్రమే వెళ్తున్నాయి. హిందూపురం, బెంగళూరు ఎక్స్‌ప్రెస్ బస్సులు గంగలకుంట రోడ్డు మీదుగా నాలుగు వరుసల రహదారి మీదుగా 44వ జాతీయ రహదారి వైజంక్షన్ మీదుగా బెంగళూరు వైపునకు వెళ్తున్నాయి. అలాగే బెంగళూరు వైపు నుంచి అనంతపురానికి ఈ రహదారి గుండానే అనంతపురానికి వెళ్తున్నాయి. ఏడాది నుంచి బస్సులు ఇలాగే వెళ్తున్నాయి. రాప్తాడు మీదుగానే బస్సులు వెళ్లాలని అధికారులు హెచ్చరిస్తున్నా సిబ్బంది మాత్రం నిర్లక్ష్య ధోరణిలో వ్యవహరిస్తూ అధికారులు ఆదేశాలు బేఖాతరు చేసి, బైపాస్‌లోనే వెళ్తున్నారు. ఆర్టీసీలో వచ్చే ప్రయాణికులు గ్రామాల్లో దిగాల్సి ఉండగా బైపాస్‌లో దింపేస్తున్నారు. దీంతో బస్సు గ్రామాల్లో వెళ్లకుండా బైపాస్‌పైనే వెళ్లడం ఏమిటని ప్రశ్నించిన ప్రయాణికులపై ఆర్టీసీ సిబ్బంది దురుసుగా వ్యవహరిస్తున్నారు.

ఘనంగా వృద్ధుల ఆరాధన

పామిడి: స్థానిక సీఎస్ఐ చర్చిలో ఆదివారం వృద్ధుల ఆరాధన ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా దైవసేవకుడు పరదేశి విజయశేఖర్‌రాజు మాట్లాడుతూ దేవుడు ముదిమి వచ్చు వరకు మనలను ఎత్తుకొని రక్షించేవాడన్నారు. దేవుని సాక్ష్యకరమైన జీవితం గల వృద్ధుల వల్ల మనకు ఆశీర్వాదాలు, దీవెనలు ఉంటాయన్నారు. వృద్ధులను గౌరవించాలన్నారు. తల్లిదండ్రులను సన్మానించువాడు దీఆర్ఘాయుష్మంతుడవుతారన్నారు. కార్యక్రమంలో చర్చి సభ్యులు, వీరయ్య, జయరాజు, ఆనంద్‌రాజ్, అబ్రహాం, లక్ష్మీనారాయణ, కరుణాకర్, ప్రసాద్, రజని, మంజుల, ప్రిస్కిల్లా, జయామణి, రేచెల్, మాణిక్యమ్మ, కీర్తిమణి తదితరులు పాల్గొన్నారు.